క్లుప్తంగా

నేడు 'ఆహారంతో ఆరోగ్యం'పై సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం మనం తినే ఆహారంతోనే ఆరోగ్యం పొందడం ఎలా అనే అంశంపై బుధవారం ఉదయం 11 గంటలకు రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు జరుగుతుందని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ వెల్‌నెస్ కోచ్‌లు కె.వి.నాగరాజు, కె.హరిత, జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా సదస్సులో పాల్గొని ఆరోగ్యం కోసం ఆహారం ఎలా తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో నగర విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ప్రకటించిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని శ్రీ మేధ సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని తమ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి ఎ.సాయివెంకట ధీరజ్ 400 మార్కులకు 335, ఎం.మోక్షిత 313, ఎస్‌కే ఇర్ఫాన్ 301, డి.లక్ష్మీనరసింహ 298, టి.వరలక్ష్మి 296, డి.నాగచంద్రిక 285 మార్కులు సాధించారని వివరించారు. తమ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కృషితోనే ఇంతటి ఫలితాలు సాధించామని ఆయన పేర్కొన్నారు.

చెస్‌లో ప్రతిభ చూపిన గీతిక



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 5, 6 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన లీలావతి మెమోరియల్ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన పూడి గీతిక ప్రతిభ కనబర్చింది. అండర్-9 విభాగంలో జరిగిన పోటీల్లో మొదటి స్థానం సాధించి పసిడి పతకాన్ని సాధించింది. కోచ్ అవ్వారు రామకృష్ణ, ఏపీ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సీనియర్ సేల్స్‌మెన్ మీసాల సింహాచలం తదితరులు సింగ్‌నగర్‌లోని తమ అకాడమీలో గీతికను మంగళవారం అభినందించారు. ఆమె మరిన్ని పతకాలు సాధించి నగరానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

వైభవంగా సహస్ర నామ పారాయణం



విజయవాడ కల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు లక్షతులసి అర్చన, విష్ణు గాయత్రి సహిత పూర్వక సహస్రనామ, విష్ణుకవచ పఠన కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణమాసం విష్ణువుకు అత్యంత ప్రియమైనదని నామపారాయణ, లక్ష తులసి అర్చనతో సర్వ పాపాలు హరిస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధిక శ్రావణ మంగళవారం సందర్భంగా దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. సాయంత్రం భజన మండలి సభ్యులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

వాటర్‌ట్యాంక్ నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న వాగు సెంటర్లో ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సూచనల మేరకు తాగునీటి మినీ ట్యాంక్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇటీవల నున్న గ్రామం వచ్చిన ఎమ్మెల్యే వంశీమోహన్‌ను ఆ ప్రాంతంలోని మహిళలు తాగునీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తాగునీటి ట్యాంక్ నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారం రోజుల్లోనే ట్యాంక్‌కు శ్లాబు వేశారు. సాధారణ నిధులు మూడు లక్షలతో పనులు చేస్తున్నారు.

కొండ ప్రాంతాల్లో మౌలిక వసతులు

- సమస్యల పరిష్కారానికి చర్యలు
- 47వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గోదావరి గంగ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 47వ డివిజన్‌లో మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్, నగర సమగ్రాభివృద్ధి కమిటీ వైస్‌చైర్మన్ గోదావరి గంగ పర్యటించారు. టేనర్‌పేట అడ్డరోడ్డులోని టీఎంహెచ్ స్కూల్ నుంచి ప్రారంభమైన పర్యటనలో తొలుత పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొండ ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రెయిన్లు, కల్వర్టులను పరిశీలించి వాటి మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండ ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంలో వచ్చిన సమస్యలు ఏ మేరకు పరిష్కారమయ్యాయనేది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గానికి రూ. 18 కోట్లు ప్రత్యేక నిధుల కింద విడుదల చేశారని చెప్పారు. కొండ ప్రాంతాల్లో వీధి దీపాల సమస్య కొంతమేర ఉందని, వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరామన్నారు. డివిజన్‌లోని మరుపిళ్ల చిట్టి పార్కు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. రోజూ ప్రజల మధ్య తిరుగుతూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జగన్ ఆశీస్సులతో నియోజక వర్గాన్ని అభివృద్ధిపథంలో నడుపుతున్నానన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డివిజన్‌లో స్థానిక సమస్యలు తెలుసుకుంటూ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తామన్నారు.

అనంతరం కార్పొరేటర్ గోదావరి గంగ పుట్టిన రోజును పురస్కరించుకుని డివిజన్‌లో కేక్ కోశారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి.. గోదావరి గంగకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు గోదావరి బాబు, దేరంగుల వెంకట రమణ, శీరం వెంకట్రావు, కూరాకుల నాగ, కుంభ నాగేశ్వరరావు, సోమిశెట్టి వెంకటేశ్వరరావు, తాండ్ర ఇంద్ర, రెడపండు క్రాంతి, శ్రీలత, హేమ, కామళ్ల జోషి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం పనులపై సమీక్ష



సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సమీక్షించారు. కమిషనర్ బంగళాలో జరిగిన సమీక్షలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లతో జరిగిన ఈ సమీక్షలో ఆయన మాట్లాడతూ అంబేడ్కర్ స్మృతి వనం పనులు మరింత వేగంగా జరగాలని సూచించారు. కొన్ని రోజులుగా రాత్రి పూట పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. రాత్రిపూట జరిగే పనుల వివరాలు తెలుసుకున్న ఆయన పెయింటింగ్ కూడా ప్రారంభించాలని సూచించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల క్విట్ ఇండియా డే ర్యాలీ



రెడ్‌సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడిన ఎన్‌సీసీ క్యాడెట్లు



ర్యాలీని ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ రమేష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత దేశభక్తిని పెంపొందించుకుని ఉద్యోగ రీత్యా విదేశాలకు వెళ్లిన సమయంలో మనదేశ గొప్పదనాన్ని అక్కడ చాటాలని సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు సూచించారు. క్విట్ ఇండియా డే సందర్భంగా మంగళవారం పీబీ సిద్ధార్థ కళాశాల నాలుగో ఆంధ్రా బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని బాబూరావు, రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. విదేశీ వస్తువులు, వస్త్రాలు వద్దు.. స్వదేశీ వస్తువులను ఉపయోగించండి అంటూ విద్యార్థులు ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలోని హాలులో క్విట్ ఇండియా ఉద్యమం వివరాలు తెలియజేస్తూ డాక్యుమెంటరీ ప్రదర్శించారు. నాలుగో ఆంధ్రా గరల్స్ లెఫ్టినెంట్ రోహిణి కుసుమ, సిబ్బంది రామయ్య, చందన, వసీమ, వైష్ణవి, జ్యోతిక తదితరులు పాల్గొన్నారు. సిద్ధార్థ కళాశాల ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది.

నలంద ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్విట్ ఇండియా మూమెంట్ డేను పురస్కరించుకుని నలంద ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ నాలుగో ఆంధ్రా బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేందర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో నలంద ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ పతాకాలు చేబూని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం నుంచి రెడ్‌సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌సర్కిల్ వద్ద మానవహారం నిర్మించారు. క్విట్ ఇండియా మూమెంట్ డేలో భాగంగా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని సూచిస్తూ వస్త్ర సంచులను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ.. గాంధీజీ నాయకత్వంలో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం స్వరాజ్యం సాధించాలన్న భారతీయుల ఆకాంక్షను బలంగా చాటిందన్నారు. ఎన్‌సీసీ నాలుగో ఆంధ్రా బాలికల బెటాలియన్ పీఐ స్టాఫ్ నాయక్ కుందన్, ఆ కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ ఎస్‌కే రఫీయాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఆధారిత కోర్సులు వినియోగించుకోండి



శిక్షణ పూర్తైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, జిల్లా అధికారి నరేష్‌కుమార్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధి ఆధారిత కోర్సులను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్కిల్ హబ్ ద్వారా ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన రెండు నెలల ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ స్కిల్ హబ్‌లో 30 మంది యువతకు ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చామన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగ యువత ఖాళీగా ఉండకూడదనే సంకల్పంతో ఉచిత శిక్షణను కళాశాల ఆవరణలో నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన 26 మందికి విజయవాడ పరిధిలోని ఇండస్ట్రీల్లో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. జూన్‌లో జరిగిన జూనియర్ డెవలపర్ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ నరేష్ కుమార్, స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ తారక రవితేజ, ట్రైనర్స్ వినోద్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ ఎన్జీవో' కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయాలి

ఏపీ ఎన్జీవో సంఘ పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 21, 22 తేదీల్లో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీవో పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఎన్జీవో కార్యాలయంలో మంగళవారం నగర శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల్లో నగర శాఖదే కీలక బాధ్యత అన్నారు. మహాసభలకు హాజరయ్యే వారికి అవసరమైన సేవలందించడంలో రాష్ట్ర నాయకత్వ సూచనల మేరకు వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్, కోశాధికారి బి. సతీష్ కుమార్, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీహెచ్ శ్రీరామ్, కె. సంపత్ కుమార్, నజీరుద్దీన్, వి.వి. ప్రసాద్, సీహెచ్ మధుసూదన్‌రావు, బి. రాజాచౌదరి, సీవీఆర్ ప్రసాద్, కె. ఆర్ఎస్ గణేష్, సీహెచ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ వార్తా కథనం పూర్తి నిరాధారం

రైల్వే మెయిల్ సర్వీస్ వై డివిజన్ సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోస్టల్ శాఖలో అవినీతిపై మంగళవారం మీడియా(సాక్షి కాదు)లో ప్రచురితమైన వార్తను రైల్వే మెయిల్ సర్వీస్ వై డివిజన్ సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వార్తా కథనం పూర్తిగా నిరాధారమైందని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ, ఎంటీఎస్ నియామకాల కోసం గ్రామీణ డాక్ సేవక్ అభ్యర్థుల అర్హతలను డిపార్ట్‌మెంటల్ రూల్స్ ప్రకారం పరిగణించి పదోన్నతికి అర్హత లేనందున ఆ ఖాళీలను ఎగ్జామినేషన్ కోటాకు కేటాయించారని వివరించారు. మరోవైపు గ్రామీణ డాక్ సేవక్ పోస్ట్ నుంచి మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌పోస్టుకు పదోన్నతి అర్హత ఉన్నదని భావిస్తున్న ఉద్యోగులు తమ నుంచి నగదు ఎవరూ డిమాండ్ చేయలేదని, ఎవరికి నగదు ఇవ్వలేదని విచారణలో రుజువైందని పేర్కొన్నారు.

అభివృద్ధి పరుగులు

- 32వ డివిజన్‌లో రూ.8.89కోట్లతో చకచకా పనులు
- టీడీపీ కార్పొరేటర్ డివిజన్‌లోనూ అభ్యున్నతి



రూ.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం



లోటస్ ల్యాండ్‌మార్క్‌లో రోడ్డు



అయోధ్యనగర్‌లో రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి పనులు పరుగు తీస్తున్నాయి. టీడీపీ కార్పొరేటర్ డివిజన్ అయినా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 32 డివిజన్‌లో రూ.8.89 కోట్ల వ్యయ అంచనాతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.7.52 కోట్ల అంచనాతో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం రోడ్డు, డ్రెయినేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన డివిజన్‌లో ప్రతి సమస్యను ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వయంగా పరిశీలించి అవసరమైన నిధులను మంజూరు చేయించి పరిష్కరిస్తున్నారు.

రూ.6 కోట్లతో లోటస్ ల్యాండ్‌మార్క్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు

చిన్నపాటి వర్షానికే చిత్తడి మారి దుర్వాసన వెదజల్లే లోటస్ ల్యాండ్ మార్క్‌లో.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 6 కోట్ల వ్యయ అంచనాతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తిచేసి సుందరంగా తీర్చిదిద్దారు.

- డివిజన్‌తో పాటు సత్యనారాయణపురం, ముత్యాలంపాడు ప్రజలకు ఉపయోగపడేలా సీకే రెడ్డి రోడ్డులో రూ. 80 లక్షల వ్యయ అంచనాతో 20 బెడ్‌ల యూపీహెచ్‌సీని నిర్మించారు. ఇక్కడ లక్షలాది రూపాయల వ్యయంతో అత్యాధునిక రక్త పరీక్షల పరికరాలను ఏర్పాటు చేశారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడానికి ఇక్కడ పూర్తి ఉచితంగా వైద్యం, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నారు.
- బుడమేరు కట్ట పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచటంతో పాటు ఆక్రమణలకు గురికాకుండా రూ. 35 లక్షలతో సైడ్ వాల్ నిర్మించారు.
- అయోధ్యనగర్ మెయిన్ రోడ్డు, బసవతారకనగర్‌లలో రూ.60 లక్షల వ్యయ అంచనాతో రోడ్డు పనులు పూర్తి చేశారు. ఇక్కడ మూడు అడుగుల మేర రోడ్డును విస్తరించారు.
- ప్రమాదకరంగా మారిన సైడ్ డ్రెయిన్‌లపై సుమారు రూ.4 లక్షలతో బల్లలు వేశారు. కాలువలకు అవసరమైన మరమ్మతులు పూర్తిచేశారు.

సమస్యలు పరిష్కారమవుతున్నాయి



డివిజన్‌లో చిన్న సమస్యల అని కూడా చూడకుండా ఎమ్మెల్యే మల్లాది విష్ణు పరిష్కరిస్తున్నారు. ఎంతో కాలం నుంచి నెలకొన్న ఇబ్బందులను తొలగిస్తున్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు.

-గుండే సుందర్‌పాల్

అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు



నేను టీడీపీ కార్పొరేటర్‌ను. అయినా మా డివిజన్‌లో ఏ చిన్న సమస్యను చెప్పినా ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే డివిజన్‌లో సుమారు రూ.7 కోట్ల పనులు పూర్తిచేయడం గమనార్హం.

-చన్నగిరి రామ్మోహన్‌రావు, కార్పొరేటర్(టీడీపీ)

ఇబ్బంది లేకుండా చేస్తున్నారు



అపరిష్కృతంగా ఉన్న బసవతారకనగర్‌లో రోడ్డు పనులు చేపట్టటం ఆనందంగా ఉంది. ఇక్కడ రోడ్డు ఎత్తు పెంచి భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారు.

-ఎం.భూషణ్‌రాజు

నాడు గోతులు.. నేడు తారు రోడ్లు



డాక్టర్స్ కాలనీలో రోడ్డు నిర్మించిన తర్వాత..



డాక్టర్స్ కాలనీలో అధ్వానంగా రోడ్డు, అభివృద్ధి చెందిన తర్వాత ఇలా

పాయకాపురం(విజయవాడరూరల్): చినుకు పడితే నడవలేని పరిస్థితి ఉండే డాక్టర్స్ కాలనీ రోడ్లను తీర్చిదిద్దారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నా గతంలో ఏ పాలకులూ ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేశారు. స్థానిక 63వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో రోడ్లు గోతులు పడి అధ్వానంగా ఉండేవి. రోడ్ల సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే విష్ణుకు విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.20 కోట్లను మంజూరు చేయించారు. కాలనీలోని 8 రోడ్లు తారురోడ్లుగా మారాయి. గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని ఈ ప్రాంతప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తరలించడానికి సిద్ధం చేసిన గోడౌన్‌పై జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేశారు. రామరాజ్యనగర్‌లోని ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు జేసీకి సమాచారం అందింది. జేసీ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి గోడౌన్‌పై దాడి చేశారు. సుమారు 232 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉంచడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పెంకే రాంబాబు అనే వ్యక్తితో పాటు లారీ యజమాని బాలస్వామిను అదుపులోకి తీసుకుని వారిపై 6-ఏ కేసు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

పలువురికి జరిమానా

పటమట(విజయవాడతూర్పు): మునిసిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తూ, నగరవాసులకు అసౌకర్యం కలిగిస్తున్న పలువురికి కార్పొరేషన్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్ జరిమానా విధించారు. పటమట సర్కిల్-3 కార్యాలయంలో మంగళవారం మొబైల్ కోర్టు జరిగింది. రోడ్లపై, డ్రెయిన్లలో చెత్త వేసే వాళ్లు, రోడ్లపై రాకపోకలకు అవరోధం కలిగేలా జంతువులను కట్టేసేవాళ్లు, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న 17 మందిపై నమోదైన కేసులను జడ్జి విజయ్‌కుమార్ విచారించారు. ఆయా కేసుల్లో నిందితులకు రూ.7,300 అపరాధ రుసుం విధించారు. నిందితులు మరోసారి నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్-3 ఎం.కృష్ణ, ఏఎంఓహెచ్-3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్‌వైజర్-3 డి.సోమరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయిని విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, నిందితుడి నుంచి 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన ఉండ్రాళ్ల సురేష్ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అతనిపై పోలీసులు నిఘా పెట్టారు. అతను సోమవారం సాయంత్రం గంజాయితో వెళ్తున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లుగా తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసి అతని నుంచి 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.